క్లుప్తంగా

అమరేశ్వరునికి రూ.1.15 లక్షల ఆదాయం



గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరులోని శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. ఈ లెక్కింపుతో స్వామికి రూ.1,15,508 ఆదాయం వచ్చిందని ఆలయ ఇన్‌చార్జి ఈఓ, మోటూరు శ్రీ సీతారామస్వామి దేవస్థాన ఈఓ జి.నాగమానిక తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ త్రిపురనేని సురేష్, అర్చకులు పాలపర్తి నరసింహారావు, సీహెచ్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. శనివారం దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి నవరాత్రులు ప్రారంభం



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించే దసరా నవరాత్రులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం ప్రారంభించనున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, చైర్మన్ ఈడె వెంకటవిష్ణు మోహన్‌రావు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే రాముతో పాటు డీఎస్పీ ధీరజ్ వినీల్‌ను సన్మానించి నవరాత్రులకు ఆహ్వానించారు.

దసరాను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

గుడివాడరూరల్: ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దేవీశరన్నవరాత్రి మహోత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించే ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు, చిన్నారులకు, మహిళలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాలని సూచించారు. అనుమతి లేకుండా డీజేలు, ర్యాలీలు, లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయవద్దన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



గుడివాడరూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిసరాలను సిబ్బందితో కలసి ఆయనే స్వయంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రశాంత వాతావరణంలో ఉద్యోగాలు చేయడం సులభమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని వ్యాధుల బారిన పడకుండా ఉండాలని సూచించారు.

స్కూల్ గేమ్స్‌లో అసిసీ విద్యార్థుల ప్రతిభ



పామర్రు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని అసిసీ ప్రిన్సిపాల్ సిస్టర్ వల్సా సబాస్టియన్ పేర్కొన్నారు. స్థానిక అసిసీ హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను శనివారం అభినందించారు. అదేవిధంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీలు గ్లాడిసన్, శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ సిస్టర్ రోజ్ థామస్, ఉపాధ్యాయులు అభినందించారు.

అమ్మవారి విగ్రహాలు రెడీ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

- ఒక్కో విగ్రహం ప్రారంభ ధర రూ.1,500
- సైజును బట్టి రూ.15 వేల వరకు

గుడివాడ టౌన్ : దసరా నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో అమ్మవారి విగ్రహాలు అమ్మకానికి సిద్ధమయ్యాయి. ఉత్సవాలకు విగ్రహాలు లభ్యమయ్యే ప్రాంతం అయిన నాగవరప్పాడు వంతెన వద్ద వ్యాపారులు ఈ విగ్రహాలను అందుబాటులోకి తెచ్చారు, గుడివాడ డివిజన్ పరిధిలో ఈ విగ్రహాలు వందల సంఖ్యలో అమ్ముడుపోతాయని వ్యాపారులు చెబుతున్నారు.



వ్యానులో తరలిస్తున్న అమ్మవారి విగ్రహాలు

ఒకటిన్నర అడుగుల ఎత్తు నుంచి..

ఒకటిన్నర అడుగుల ఎత్తు నుంచి ఏడు అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు ఉంటాయని పేర్కొన్నారు. ధర కూడా అందుబాటులోనే ఉంటుందని వ్యాపారులు తెలిపారు. అడుగున్నర విగ్రహం రూ. 1,500 నుంచి ధర ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. సైజును బట్టి రూ. 5 వేలు, రూ. 7 వేలు, రూ. 8 వేలు, రూ. 10 వేలు, రూ. 15 వేలు వరకు విక్రయిస్తామని తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతున్న సందర్భంగా ఇప్పటికే కొన్ని విగ్రహాలు అమ్ముడుపోయాయని పేర్కొన్నారు. కొందరు అడ్వాన్స్ ఇచ్చి విగ్రహాలను భద్రపర్చుకున్నారని వ్యాపారులు తెలిపారు.

రేపటి నుంచి శరన్నవరాత్రులు

శ్యామలాంబ దేవస్థానంలో అక్టోబరు 3 వరకు ఉత్సవాలు



ఉత్సవాలకు సిద్ధమైన శ్యామలాంబ ఆలయం

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన కైకలూరు శ్యామలాంబ దేవస్థానంలో మహాయాగ సహిత దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబరు మూడో తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణలు, క్యూల ఏర్పాట్లు పూర్తి చేశారు. మహాశక్తి రూపిణి, కైకలూరు ఇలవేల్పు శ్యామలాంబ అమ్మవారంటే ఇక్కడ భక్తులకు భక్తితో పాటు భయం కూడా ఉంది. ప్రతి కుటుంబంలోనూ ఒకరి పేరు శ్యాము, శ్యామల సంబంధిత పేర్లు పెట్టుకుంటారు. సగం వ్యాపార దుకాణాల పేర్లు శ్యామలగా ఇక్కడ ఉంటాయి. ముఖ్యంగా అమ్మవారి ప్రాంగణంలో మూడు శివాలయాలు పక్కపక్కనే కొలువుతీరడం విశేషం. గోపూజ, బందా వంశస్థులతో కలశస్థాపనతో దేవీ శరన్నరాత్రులు సోమవారం ఉదయం నుంచి ప్రారంభమవుతాయి. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కైకలూరు శ్రీమాన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు సీహెచ్ హేమలత ఆధ్వర్యంలో లలితా సహస్ర పారాయణం నిర్వహిస్తారు.



ఏర్పాట్లు పూర్తి

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దసరా ఉత్సవాల్లో భక్తులకు ఉచిత ప్రసాదాన్ని దాతలు ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి.
– వీఎన్‌కే శేఖర్, ఆలయ ఈఓ, కైకలూరు

అమ్మవారి విశేష అలంకరణలు

నవరాత్రులలో శ్యామలాంబ విశేష అలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఈ నెల 22న బాలాత్రిపుర సుందరీదేవి, 23న గాయత్రీదేవి, 24న కాశీ అన్నపూర్ణాదేవి, 25న ధాన్యలక్ష్మి, 26న ధనలక్ష్మి, 27న లలితా త్రిపురసుందరీ దేవి, 28న రాజరాజేశ్వరీదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న పార్వతీదేవి, 2న మహిషాసురమర్దనిదేవి, 3న పుష్పశయన అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా జంపన రామలింగరాజు, సింహాద్రి రాంబాబు, పోతునూరి సుజాత, అన్నం వెంకట అంజనీ, నాగనబోయిన నాంచారయ్య, దేవరపల్లి వెంకట సుబ్రహ్మణ్యశర్మ, కటికిన పద్మావతి, గాదంశెట్టి ఉషారాణి, గొల్లు గౌరిశ్రీ, ఇంటి ఝాన్సీరాణి, పంద్రంగి కనక దుర్గాప్రసాద్ నియమితులయ్యారు.

పామర్రులో..

పామర్రు: దసరా నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. స్థానిక అంకమ్మతల్లి ఆలయం, కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం, పర్వత వర్ధనీ దేవి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రుల నిర్వహణకు ఆలయాలను విద్యుత్ దీపాలతోతీర్చిదిద్దుతున్నారు. ఈనెల 22 నుంచి ప్రారంభం అయి వచ్చే నెల రెండో తేదీ వరకు నవరాత్రులు జరుగుతాయి. కాగా సోమేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించామని ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ముదినేపల్లిలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ రామకృష్ణ



కూచిపూడి హైస్కూల్లో మొక్కలు నాటుతున్న అధికారులు

కూచిపూడి(మొవ్వ): గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని ఎంపీడీఓ సుహాసిని పేర్కొన్నారు. ఆమె మొవ్వ మండలంలోని కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందుగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులతో ర్యాలీ, మానవహారం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, నాయకుడు అమర బాలేశ్వరరావు, హెచ్ఎం అమిరెడ్డిఅను పల్లవి భువనేశ్వరి, పంచాయతీ కార్యదర్శి వీర హనుమాన్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి

ముదినేపల్లి రూరల్ : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వై.రామకృష్ణ అన్నారు. ముదినేపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జి.రమేష్, వీఆర్వో హనుమంతరావు, మీసాల సత్యనారాయణ, మల్లంపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

గుడ్లవల్లేరు: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలకు వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ సన్నిధిలో భక్తులకు శోభాయమానంగా ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను శనివారం ఆలయ ఈఓ ఆకుల కొండలరావు, చైర్మన్ ఈడె వెంకట విష్ణు మోహన్‌రావు పరిశీలించారు. అమ్మవారి ఆలయం ఎదుట ఎంఎన్‌కే రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అవరోధం లేకుండా భారీ ఎత్తున వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వంటపాత్రలు అందజేత

గుడివాడ టౌన్ : శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వంటపాత్రలు అందజేశారు. స్థానిక దనియాల పేటలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు శనివారం ఈ పాత్రలు అందజేసినట్లు సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. కళింగ కార్పొరేషన్ డైరక్టర్ ఎం. నాగరాజు వితరణతో ఈ ఏర్పాటు చేశామన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి వారు ఈ పరీక్షలను చేశారు. కొల్లి రాజేష్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ పెరమాళ్ల తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు ప్రసాద్, నాగేశ్వరరావు, మోహనరావు, పరంధామయ్య పాల్గొన్నారు.

కొండిపర్రులో..

కొండిపర్రు(పామర్రు): మండలంలోని కొండిపర్రులో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్‌లో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ నూకారపు వీరాంజనేయులు, గ్రామ సర్పంచ్ పసుపులేటి రుక్మిణి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 40 మందికి వైద్యసేవలను అందించారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

గుడివాడ టౌన్ : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలంటే అవగాహన అవసరం అని అంకిత స్వచ్ఛంద సంస్థ మేనేజర్ టి. అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక జగన్నాథపురంలోని అంకిత కార్యాలయం నుంచి ప్రజా అవగాహన ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ పి. కిషోర్, ఎస్‌టీఐ కౌన్సిలర్ కె. ఐజక్, సంస్థ పీఓ జి. బేబీ సరోజిని, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా తాపీ ధర్మారావు జయంతి



నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

గుడివాడ టౌన్ : ప్రముఖ అభ్యుదయ రచయిత, సాహితీవేత్త తాపీ ధర్మారావు(తాతాజీ) జయంతి శనివారం నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సనాతన ధర్మంపై తిరుగుబాటు చేసిన తెలుగు యోధుల్లో తాతాజీ అగ్రగణ్యుడన్నారు. వర్ణ వ్యవస్థను ఏర్పాటు చేసి సాటి మనిషిని హీనంగా చూసే నీచ సంస్కృతిని తన రచనల ద్వారా ఎండగట్టి, ఆనాటి యువతరాన్ని చైతన్యపర్చిన ధీశాలి తాతాజీ అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కోటేశ్వరరావు, కిషోర్, బసవేశ్వరరావు, శ్రీధర్, వంశీ, పీటర్, గుప్త, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



గుడ్లవల్లేరు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డీ.మేరీ, నసీర్ ఉన్నిసా పేర్కొన్నారు. రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా గుడ్లవల్లేరు సెక్టార్‌లోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై తల్లులకు, పిల్లలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయండి



పామర్రు: 'సమగ్ర శిక్ష'లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మండల అధ్యక్షురాలు పీయూఎస్ఎం దేవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల రిసోర్సు భవనం వద్ద మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యను చర్చించాలన్నారు. ఉద్యోగులకు భద్రత చట్టం చేయాలన్నారు. ఆగస్టు నెల జీతం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, సీఆర్ ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కళ్లజోళ్లు

గుడివాడ టౌన్ : లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మాదాల సురేష్ తెలిపారు. శనివారం స్థానిక ఏలూరు రోడ్‌లోని ఫాదర్ బియాంకి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో 35 మంది విద్యార్థులకు ఉచిత కళ్లజోళ్లు అందజేశామని పేర్కొన్నారు. ఈనెల 10, 11 తేదీలలో పాఠశాల లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. శనివారం అర్హులందరికీ కళ్లజోళ్లు అందజేసినట్లు పేర్కొన్నారు. క్లబ్ కార్యదర్శి పి. కేశవరావు, ఉపద్రష్ట రాంబాబు, ఎం. వీర శేఖర్, ఆర్. వేణుబాబు, సనకా సుబ్బారావు, ఎన్. శేషగిరిరావు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో అశ్రద్ధ వద్దు



తామరకొల్లు శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

కైకలూరు: ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని శీనతపల్లి పీహెచ్‌సీ డాక్టర్ అన్నపూర్ణ సూచించారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా తామరకొల్లు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ శిబిరంలో నిర్వహించే బీపీ, షుగర్, క్యాన్సర్, రొమ్ము, రక్తహీనత తదితర పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భట్రాజు శివాజీ, ఎంపీటీసీ గంగుల వెంకట నరసమ్మ, వైద్య సిబ్బంది రహీం, లక్ష్మీకుమారి, రామకృష్ణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్

మండవల్లి: స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ మెండా ఝాన్సీ మాట్లాడుతూ పీహెచ్‌సీలో డాక్టర్లు పేషెంట్స్‌ని బాగా చూసుకొన్నప్పుడే ఆస్పత్రికి పేరు వస్తుందన్నారు. ఐసీడీఎస్ అధికారి వి.దీప్తి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బీజేపీ నాయకుడు గంగునేని వరప్రసాద్ మాట్లాడారు.

కొల్లికి నివాళులు

ముదినేపల్లి రూరల్ : మండలంలోని కోమర్రు మాజీ సర్పంచ్ కొల్లి వెంకట సత్యనారాయణ (చిన్ని)కు వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం నివాళులర్పించారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని పెయ్యేరులో నివాసముంటున్న సత్యనారాయణ శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పార్టీ నియోజకవర్గ నాయకుడు దూలం వినయ్, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీ గాలిబ్, ఎ.వెంకటేశ్వరరావు, సింగంశెట్టి రాము, బత్తిన కిషోర్, రంగిశెట్టి నరసింహారావు తదితరులు ఉన్నారు.

పేదల శ్రమను దోచుకుంటున్న కూటమి ప్రభుత్వం

గుడివాడ టౌన్: కూటమి ప్రభుత్వం పేదల శ్రమదోపిడి విధానానికి తెరలేపిందని శ్రామిక హక్కుల పోరాట సంఘం కన్వీనర్ ఆర్. రఘు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కార్మికులతో 13 గంటల పనిచేయించుకోడానికి అనుమతి ఇస్తూ ఫ్యాక్టరీ సవరణ చట్టం 2025కు ఆమోదం తెలిపిందన్నారు. పెట్టుబడిదారులను సంతృప్తి పర్చేందుకు ప్రభుత్వం ఈ సవరణ చేపట్టిందన్నారు. 13 గంటల పనిదినాన్ని మహిళలకు రాత్రి షిఫ్టులో కూడా పని చేయాలనే నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇది అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలన్నింటినీ కుదిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శ్రామిక వర్గాలకు తీవ్ర నష్టం కలుగజేస్తుందన్నారు. రాష్ట్రంలోని కార్మికులంతా ఏకమై, దీనిని వ్యతిరేకించాలని ఆయన కోరారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే తెలియజేయండి

కైకలూరు: పాఠశాలలు, కాలేజీల నుంచి ఇంటికి వెళుతున్న బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే భయపడకుండా పోలీసు సిబ్బందికి తెలియజేయాలని శక్తి టీం కానిస్టేబుల్స్ అన్నారు. రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ ఆదేశాల మేరకు కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని పాఠశాలలు, కాలేజీలో విద్యార్థులకు పలు అంశాలపై శనివారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా గుడ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలు తెలుసుకోవాలన్నారు. సమస్య వస్తే పోలీసు సిబ్బందికి చెప్పాలని కోరారు.

అక్కినేని నాగేశ్వరరావుకు ఘన నివాళి



అక్కినేనికి నివాళులర్పిస్తున్న ఏఎన్నార్ కళాశాల యాజమాన్యం



పెదపూడి–కూచిపూడి సెంటర్లో ఏఎన్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

గుడివాడ టౌన్ : ప్రముఖ సినీ నటుడు, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో కళాశాల యాజమాన్యం అక్కినేని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్ కేఏస్ అప్పారావు మాట్లాడుతూ కళాకారునిగా గుడివాడ పరిసర ప్రాంత ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అక్కినేని నాగేశ్వరరావు ఇచ్చిన భూరి విరాళం విద్యాలయ ఏర్పాటుకు కారణమైందన్నారు. విద్యాభివృద్ధికి ఆయన ఎంతో ప్రోత్సాహం ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ పీజేఎస్ కుమార్, ఎ. రామారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, కె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో..

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడి–కూచిపూడి ప్రధాన సెంటర్లో శనివారం ప్రముఖ సినీ నటులు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ వల్లాది విష్ణువర్ధనరావు, అయ్యంకి ఆనందరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: నియోజకవర్గంలో ఎప్పటినుంచో ఉన్న అనాధీన, సొసైటీలు, కండిషన్ పట్టాల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజావేదికలో నియోజకవర్గంలోని రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే శనివారం సమావేశం నిర్వహించారు. నందివాడ మండలంలో నెలకొన్న సమస్యలను తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. ఆ సమస్యలను ఎమ్మెల్యే ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దృష్టికి తీసుకెళ్లారు. చాలాకాలంగా పరిష్కారం కానీ భూ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నందివాడ మండలంలోని తమిరిశ, ఇలపర్రు, పోలుకొండ, రుద్రపాక గ్రామాల్లో భూ సమస్యలు అధికంగా గుర్తించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ చర్యలు చేపడతానని చెప్పారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు తహసీల్దార్‌లు కిరణ్, గురుమూర్తిరెడ్డి, లోకరాజు పాల్గొన్నారు.

బోధనాభ్యాస సామగ్రి ప్రదర్శన



పెదపాలపర్రులో టీఎల్ఎం ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

ముదినేపల్లి రూరల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాలు శనివారం పెదపాలపర్రు, ముదినేపల్లి, బొమ్మినంపాడు, చిగురుకోట, అల్లూరు హైస్కూళ్లల్లో నిర్వహించారు. పలు సబ్జెక్టుల బోధనపై చర్చించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనాభ్యాస సామగ్రితో (టీఎల్ఎం) తయారుచేసిన పదాలు, ఒత్తులు, దీర్ఘాలకు సంబంధించి తయారు చేసిన సామగ్రిని ప్రదర్శించారు. పెదపాలపర్రు సమావేశంలో ఉపాధ్యాయురాలు వి.ప్రసన్నకుమారి తయారు చేసిన పదాల సామగ్రి ఆకట్టుకుంది.

ఉపాధ్యాయుడు బెనర్జీకి సన్మానం

కైకలూరు: మండల ఉత్తమ ఉపాధ్యాయుడు గోపవరం పాఠశాలకు చెందిన దండే బెనర్జీని తామర కొల్లు కాంప్లెక్స్ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. చిన్నారులకు బోధనతో పాటు సహజ కవిగా బెనర్జీ పేరు గడించారని, భవిష్యత్తులో ఆయన మరింతగా రాణించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.